సాక్షి
అనకాపల్లి

శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



ఘాట్ రోడ్డు పరిశీలన

పద్మనాభం: అనంత పద్మనాభస్వామి ఘాట్ రోడ్డును టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ బృందం గురువారం పరిశీలించింది.



సహస్ర తులసి పూజ

విశాఖ: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం ఘనంగా సహస్ర తులసిపూజ నిర్వహించారు.



నేత్రదానం II లో

మరణించాక కూడా ఇద్దరికి వెలుగును ఇవ్వవచ్చు. వారి ద్వారా జీవించవచ్చు. అపోహల వల్ల చాలామంది ముందుకు రావడం లేదు.

శ్రావణ సందడి





కొనుగోలుదారులతో కిక్కిరిసిన చిననాలుగురోడ్ల కూడలి



పూలు, పండ్లు విక్రయాలతో సందడిగా మారిన బండిగాడివీధి

- కొనుగోలుదారులతో కిటకిటలాడిన మార్కెట్
- వరలక్ష్మీ వ్రతం కావడంతో పళ్లు, పూలకు డిమాండ్



వస్త్రదుకాణంలో మహిళల కోలాహలం

అనకాపల్లి టౌన్: పట్టణ మార్కెట్ శ్రావణ శోభతో కళకళలాడుతోంది. ఈ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం కావడంతో పూజా సామాగ్రి మొదలుకొని వస్త్ర, బంగారు, పూలు, పండ్ల దుకాణాలు కిటకిటలాడిపోతున్నాయి. నెహ్రూచౌక్, చిననాలుగురోడ్ల కూడళ్లు మహిళలతో సందడిగా కనిపించాయి. సిరులతల్లి వరలక్ష్మీ వ్రతానికి పూలు, పండ్లు, చీర, రవిక, లక్ష్మీదేవి ముఖచిత్రంతో కలిగిన అమ్మవారి బంగారు కాసును కొనుగోలు చేసి పూజించడం ఆనవాయితీగా వస్తోంది. ధరలు ఆకాశాన్నంటుతున్నప్పటికీ అన్నివర్గాల వారు ఆచరించే పూజ కావడంతో ఇసుకేస్తే రాలనంతటి రద్దీ నెలకొంది. కొబ్బరికాయ రూ.40 నుంచి రూ.50లు పలుకుతుండగా.. చామంతి 20 రూపాయలకు ఆరేడు పూలు మాత్రమే రావడంతో భక్తులు గగ్గోలు పెడుతున్నారు. అరడజను అరటి పళ్లతోనే సరిపెడుతున్నారు. తులం బంగారంతో చేసిన లక్ష్మీదేవి ముఖచిత్రంతో ఉన్న కాసు రూ.7 వేలు పలుకుతోంది. దీంతో బంగారుపూతతో తయారు చేసిన కాసులను మహిళా భక్తులు రూ.2 వేలకు కొనుగోలు చేస్తున్నారు.

చంద్రయాన్‌లో మన భరద్వాజుడు

- తమ ఊరి యువకుడి ప్రతిభకు మురిసిపోతున్న గవరవరం
- చంద్రయాన్–3లో పాలుపంచుకున్న యువ శాస్త్రవేత్త



భారత్‌కు, భరద్వాజ్‌కు అభినందనలు చెబుతున్న జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

చోడవరం రూరల్: చంద్రయాన్–3 విజయం ద్వారా భారత్ ఖ్యాతి ఖండాంతరాలలో వ్యాపించగా.. ఆ విజయంలో భాగస్వామి అయిన తమ ఊరి శాస్త్రవేత్త భరద్వాజ్ తమ గ్రామానికే గౌరవం తెచ్చాడంటూ గవరవరం గ్రామం మురిసిపోతోంది. గ్రామంలో సత్యం పంతులుగా పేరున్న కొమ్మనమంచి సత్యం మనుమడు భరద్వాజ్ శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రంలో 2021 నుంచి గ్రేడ్ సి శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. చంద్రయాన్–3 ప్రయోగంలో తన వంతు భూమికను పోషించారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు చంద్రయాన్ సాఫ్ట్ ల్యాండింగ్‌తో రాకెట్ ప్రయోగాల చర్చలతో భరద్వాజ్ ఒక్కసారిగా ఊరి వారందరికీ గుర్తులోకొచ్చారు. అంతటి గొప్ప విజయంలో తమ గ్రామానికి చెందిన యువశాస్త్రవేత్త భాగస్వామి కావడం తమ ఊరికే గర్వకారణమన్న గ్రామస్తుల మెచ్చుకోలు, అభినందనలతో ఆయన తాతయ్య సత్యం పంతులు సంతోషంలో మునిగితేలారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నతపాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు భారత్‌కు, భరద్వాజ్‌కు జేజేలు పలికారు. హైస్కూలు విద్యను చోడవరంలోని ప్రైవేటు పాఠశాలలో పూర్తి చేసిన భరద్వాజ్.. కళాశాల విద్యను విశాఖపట్నంలో పూర్తి చేశారు. ఆయన తండ్రి కె.వెంకటరావు విశాఖలోని జిందాల్ కంపెనీలో చేస్తున్నారు.

ఇక గగన్‌యాన్ కోసం శ్రమిస్తాం..



చంద్రయాన్–3 విజయవంతంగా చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ కావడం మమ్మల్ని ఎంతో ఉద్విగ్నానికి, ఉత్తేజానికి, సంతోషానికి గురి చేసింది. త్వరలో గగన్‌యాన్ ప్రాజెక్టు కూడా ఇలాంటి విజయాన్నే నమోదు చేయాలని ఆకాంక్షిస్తున్నాను. చంద్రయాన్–2 ప్రయోగించే నాటికి నేను ఇంకా విద్యార్థినే. శాస్త్రవేత్తగా చేరిన కొద్ది కాలంలోనే చంద్రయాన్–3 ప్రాజెక్టులో భాగమైనందుకు గర్వంగా ఉంది. మా బృందం శ్రీహరికోటలో చంద్రయాన్ ప్రయోగ రాకెట్‌ను నిలిపిన దగ్గర నుంచి కౌంట్‌డౌన్ పూర్తయ్యే వరకు ఈ ప్రక్రియలో పాలుపంచుకుంది. అంతరిక్ష ప్రయోగాల పట్ల గల మక్కువతో ఇంటర్మీడియట్ అనంతరం జేఈఈ మెయిన్స్‌లో మంచి మార్కులు సాధించి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ)లో సీటు సాధించాను. అదే నన్ను ఇస్రోలో శాస్త్రవేత్తను చేసింది.

– భరద్వాజ్, ఇస్రో శాస్త్రవేత్త

న్యూస్‌రీల్

ప్రత్యామ్నాయ పంటలే శరణ్యం

- ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ జగన్నాథరావు సూచన



సమావేశంలో మాట్లాడుతున్న జగన్నాథరావు

అనకాపల్లి టౌన్ : ప్రస్తుత పరిస్థితుల్లో ఆశించిన వర్షపాతం నమోదు కానందున ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు అన్నారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు 435.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 357.8 మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదైందని చెప్పారు. అంటే 181 శాతం తక్కువ నమోదైందని, ఆగస్టులో నేటి వరకు 137 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 62 శాతం తక్కువ అంటే 53 మిల్లీమీటర్ల వర్షం కురిసిందన్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలో వరి నారుమడి దశలోనే ఎండిపోయే స్థితికి చేరుకుందన్నారు. వారం, పది రోజుల్లో ఆశించిన మేర వర్షాలు నమోదు కాకుంటే ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. జిల్లాలో వివిధ సాగు పద్ధతుల్లో చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ పంటలపై శాస్త్రవేత్త కేవీ రమణమూర్తి అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు, ఆత్మ పీడీ ఆశాదేవి, ఉద్యానశాఖ జిల్లా అధికారి ప్రభాకరరావు, చెరకు ప్రధాన శాస్త్రవేత్త డి.ఆదిలక్ష్మి, శాస్త్రవేత్తలు సీహెచ్ ముకుందరావు, విశాలాక్ష్మి, శ్రీదేవి, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నిజాలు నిర్భయంగా చెప్పండి

- ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు
- ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- వాస్తవాలను వెలుగులోకి తేవాలి
- మీడియాతో ముఖాముఖిలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, ఎమ్మెల్యే బాబూరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఏపీఐ డబ్ల్యూఏ చైర్మన్ దిలీప్‌కుమార్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ తదితరులు

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నాలుగున్నరేళ్ల పాలనలో అవినీతికి తావు లేకుండా అభివృద్ధి.. సంక్షేమం అందిస్తుంటే ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని, వాటిని తిప్పికొడుతూ వాస్తవాలను ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత మీడియాపై ఉందని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి.. ఈ ప్రభుత్వంలో జరిగిన ప్రగతిని బేరీజు వేసుకుని నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఆయన కోరారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో గడిచిన నాలుగేళ్లలో 2.13 లక్షల కొత్త ఉద్యోగాల కల్పన జరిగిందన్నారు. అనకాపల్లి టౌన్‌లో ఓ హోటల్లో గురువారం మీడియా ప్రతినిధులతో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు. ఈ సందర్భంగా గతానికీ, ఇప్పటికీ అభివృద్ధిలో తేడాను వివరిస్తూ గణాంకాలతో ఒక డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. రాష్ట్రం దివాలా తీసిందని కొందరు వక్రభాష్యాలు చెబుతున్నారని చెబుతూ, రాష్ట్ర జీడీపీని, తలసరి ఆదాయాన్ని పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. ఇంకా ఏం చెప్పారంటే..

- 2018–19లో జీఎస్‌డీపీ వృద్ధి రేటులో ఏపీ 22వ స్థానంలో ఉండగా.. ఆర్‌బీఐ తాజా నివేదిక ప్రకారం ప్రస్తుతం 22 స్థానాలు ఎగబాకి మన రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచింది.
- రాష్ట్ర తలసరి ఆదాయం 2019లో రూ.1.5 లక్షలతో 17వ స్థానంలో ఉంటే.. ఇప్పుడు 8 స్థానాలు ఎగబాకి రూ.2.1 లక్షలతో 9 స్థానంలో ఉంది.
- గత ప్రభుత్వంలో వ్యవసాయ రంగంలో 27వ స్థానంలో ఉంటే.. 2022 నాటికి 8.2 శాతం వృద్ధితో 6వ స్థానానికి వచ్చింది.
- పాఠశాలల నిర్వహణలో గత ప్రభుత్వంతో పోల్చితే ఈ ఏడాది 17 స్థానాలు మెరుగుపరుచుకుని 7వ స్థానానికి ఎగబాకింది.
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే ఏపీ వరుసగా మూడేళ్ల మొదటి స్థానంలో నిలిచింది. ఈ ఏడాది నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రాష్ట్రం రూ.13.5 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. ఏపీలో 1.52 లక్షల కొత్త ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేయడం ద్వారా సుమారు 13.63 లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టించాం. ఏపీలో రిలయన్స్, అదానీ, టీసీఎస్, ఐటీసీ, హీరో మోటోకార్ప్, గ్రాసిమ్, జేఎస్ డబ్ల్యూ, యోకోహమా, ఇన్ఫోసిస్‌తో సహా అనేక టాప్ కంపెనీలు, పరిశ్రమలు పెట్టుబడులు పెట్టి రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఆసరాగా నిలిచాయి.

మీడియా ప్రతినిధుల సలహాలు

ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మీడియా ప్రతినిధుల నుంచి జిల్లా అభివృద్ధికి సంబంధించి పలు సలహాలు, సూచనలు ఆహ్వానించారు. జిల్లాలో సాగునీటి సమస్య చెరకు సాగుపై, బెల్లం తయారీపై ప్రభావం చూపుతోందని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తయితేనే ఈ సమస్య తీరుతుందని మీడియా ప్రతినిధులు చెప్పారు. సుబ్బారెడ్డి స్పందిస్తూ.. భూసేకరణ ప్రక్రియ పురోగతిలో ఉందని, వీలైనంత మేరకు త్వరగా పూర్తి చేసేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలని, టెక్స్‌టైల్స్ పరిశ్రమలకు కూడా మినహాయింపులు ఇవ్వాలని పలువురు సూచించారు. జర్నలిస్టులకు స్థలాలు ఇవ్వాలని కోరారు. వీటిపై సానుకూలంగా స్పందించిన సుబ్బారెడ్డి ఈ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, మాజీ డీసీసీబీ చైర్మన్ సుకుమార్‌వర్మ, ఎంపీపీ గొర్లె సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.7.58 కోట్ల నవరత్నాలు–ద్వైవార్షిక నగదు జమ



లబ్ధిదారులకు రూ.7.58 కోట్ల నమూనా చెక్కును అందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: అర్హులైన ప్రతి ఒక్కరినీ జల్లెడ పట్టి మరీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. తాడేపల్లిలో సీఎం జగన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన నవరత్నాలు–ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయంలో ఆయనతో పాటు జీఎస్‌డబ్ల్యూఎస్ ప్రత్యేక అధికారి మంజులవాణి, డీఆర్‌డీఏ ఏపీడీ డైసీ వీక్షించారు. అనంతరం రూ.7 కోట్ల 58 లక్షల 49 వేల 019 నగదు చెక్కును లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నవరత్నాలు–ద్వైవార్షిక నగదు మంజూరు కింద అర్హత గల 6,217 మంది లబ్ధిదారులకు వివిధ పథకాల కింద ఈ నగదు జమ చేసినట్లు వెల్లడించారు. అమ్మ ఒడి పథకంలో 366 మందికి రూ.54.90 లక్షలు, చేదోడు పథకంలో 1,895 మందికి రూ.1.89 కోట్లు, ఈబీసీ నేస్తంలో 111 మందికి రూ.16.65 లక్షలు, మత్స్యకార భరోసా కింద 23 మందికి రూ.2.30 లక్షలు, విద్యాదీవెనలో 1,615 మందికి రూ.2.12 కోట్లు, వసతి దీవెన 1,233 మందికి రూ.1.07 కోట్లు, వైఎస్సార్ ఆసరా 579 మందికి రూ.1.57కోట్లు, వైఎస్సార్ సున్నా వడ్డీ, పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ 395 మందికి రూ.17.66 లక్షలు లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో ఉదయశ్రీ, సర్పంచ్ పసుపులేటి లక్ష్మి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ నియామకం

- 55 మందితో నూతన కార్యవర్గం
- జిల్లా అధ్యక్షుడిగా బొడ్డేడ.. ఉపాధ్యక్షులుగా కిలపర్తి భాస్కర్‌రావు, బొగ్గు శ్యామల



సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా పార్టీ కమిటీని నియమించారు. 55 మందితో కూడిన కమిటీలో ఒక అధ్యక్షుడు, ఇద్దరు ఉపాధ్యక్షులు, నలుగురు ప్రధాన కార్యదర్శులు, ఒక అధికార ప్రతినిధి, కోశాధికారి, 15 మంది సెక్రటరీలు, 30 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఉన్నారు. ఈమేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

పార్టీ జిల్లా కమిటీ ప్రెసిడెంట్‌గా బొడ్డేడ ప్రసాద్ (యలమంచిలి), వైస్ ప్రెసిడెంట్లుగా కిలపర్తి భాస్కర్‌రావు (మాడుగుల), బొగ్గు శ్యామల (చోడవరం), జనరల్ సెక్రటరీలుగా నాగులాపల్లి రాంబాబు (చోడవరం), డి.ఎస్.వి.సత్యనారాయణరాజు (మాడుగుల), ద్వారపురెడ్డి బాబ్జీ (యలమంచిలి), సూరిశెట్టి రమణ అప్పారావు (అనకాపల్లి) నియమితులయ్యారు. ట్రెజరర్‌గా కాసు అంజిరెడ్డి (పెందుర్తి), అధికార ప్రతినిధిగా పిన్నంరాజు వీడీపీ సన్యాసిరాజు (యలమంచిలి), సెక్రటరీలుగా పడాల గణపతిరావు (అనకాపల్లి), బొడ్డు గోవింద్ రావు (నర్సీపట్నం), కొణతాల శ్రీనివాస్(పాయకరావుపేట), వేంపల్లి ఆనందేశ్వరరావు (చోడవరం), దాసరి అప్పారావు (యలమంచిలి), లొడగల చంద్రారావు (పాయకరావుపేట), పతివాడ అప్పారావు (చోడవరం), జనపరెడ్డి శేషరత్నం (పాయకరావుపేట), కోడా కోటేశ్వరరావు (పాయకరావుపేట), దెద్దం పద్మావతి (పెందుర్తి), సబ్బవరపు వెంకునాయుడు (నర్సీపట్నం), పినబోయిన అప్పారావు యాదవ్ (చోడవరం), శరగడం సిమ్మినాయుడు (చోడవరం), యల్లపు కుమారరాజా (పాయకరావుపేట), జాజుల రమేష్ (అనకాపల్లి), సీహెచ్ అనురాధ (యలమంచిలి)లను నియమించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కోవెల జనార్దన్(చోడవరం), శెట్టి సత్యనారాయణ మూర్తి (చోడవరం), గొర్లె చెల్లంనాయుడు (చోడవరం), వరదపురెడ్డి సన్యాసిరావు (మాడుగుల), పోలిమెర విజయలక్ష్మి (మాడుగుల), దాడి రమణ చిట్టి (పెందుర్తి), సుందరపు అప్పారావు (పెందుర్తి), ఉలబాల శ్రీను (నర్సీపట్నం), సేనాపతి వెంకట రత్నం(నర్సీపట్నం), కణితి అన్నపూర్ణ (నర్సీపట్నం), గంట లలిత (నర్సీపట్నం), కొణతాల వరలక్ష్మి (నర్సీపట్నం), కాళ్ల త్రినాథ్ (నర్సీపట్నం), మల్లే లోవరాజు (పాయకరావుపేట), మొగలి పార్వతి (యలమంచిలి), సేనాపతి సూరిబాబు (యలమంచిలి), ఆడారి సూరి అప్పారావు (అనకాపల్లి), వియ్యపు భూలోక నాయుడు (అనకాపల్లి), బొడ్డు దేముడుబాబు (అనకాపల్లి), విల్లూరి శివ సూర్యనారాయణ (అనకాపల్లి), తుమ్మ కల్పన(పాయకరావుపేట), యలమంచిలి చిన రమణ (అనకాపల్లి), శెట్టి వెంకట రమణ (పాయకరావుపేట), కొవిరి వెంకటేశ్వర్లు (యలమంచిలి), ఎట బాబురావు (యలమంచిలి), శ్రీనాథ్ శ్రీనివాసరావు (మాడుగుల), మదక అన్నపూర్ణ (చోడవరం), కశింకోట నీలేంద్ర (పాయకరావుపేట), చవిటిన కంటమ్మ (చోడవరం) వ్యవహరిస్తారు.

బెల్లం మార్కెట్‌కు పూర్వ వైభవం



సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ పలకా యశోద, రవి దంపతులు

అనకాపల్లి టౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి బెల్లం మార్కెట్ సమస్యలను పరిష్కరిస్తామని, పూర్వ వైభవం తీసుకువస్తామని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. గురువారం మార్కెట్ యార్డులో వివిధ విభాగాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో చెరకు, వరి పంటలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ పలకా యశోద, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి దంపతులు ఈ సందర్భంగా సుబ్బారెడ్డిని శాలువతో సత్కరించి, బెల్లం దిమ్మ, ఆవు దూడ బొమ్మను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మార్కెట్ యార్డు శాఖ ఏడీ రవికిరణ్, మార్కెట్ యార్డు కార్యదర్శి డి.శకుంతల, కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, సభ్యులు నీటిపల్లి లక్ష్మి, మరిపల్లి శోభ, బొబ్బిలి శ్యామల, కొణతాల విజయ్‌కుమార్, గుండా రమేష్ గుప్తా పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి కౌన్సెలింగ్

మహారాణిపేట (విశాఖ): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14 మంది సిబ్బంది ఉండాలన్న లక్ష్యంతో నిర్వహిస్తున్న కౌన్సెలింగ్, పోస్టింగ్ ప్రక్రియకు గురువారం శ్రీకారం చుట్టారు. రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఉమాసుందరి పర్యవేక్షణలో మల్టీ పర్పస్ హెల్త్ సూపర్ వైజర్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

'గాంధీ' పరిశోధన పత్రాలకు ఆహ్వానం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాంధీయన్ విజన్ జర్నల్‌లో ప్రచురించడానికి పరిశోధకుల నుంచి పరిశోధన పత్రాలను ఆహ్వానిస్తున్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్‌లో ప్రచురించే ఈ సంచికలో గాంధీజీ ఆలోచనలు విస్తృతంగా చర్చిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ పరిశోధన పత్రాలను aungsc@gmail.comకి పంపాలని కేంద్ర సంచాలకులు ఆచార్య కె.సీతామాణిక్యం సూచించారు.

రాజభాష అమలులో వాల్తేర్ డివిజన్ భేష్

- పార్లమెంట్ సబ్ కమిటీ ప్రశంస



కమిటీ కన్వీనర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం (విశాఖ): రాజభాష అమలులో వాల్తేర్ డివిజన్ ఉత్తమ ఫలితాలు సాధిస్తోందని పార్లమెంటరీ అధికారిక భాషా కమిటీకి చెందిన 2వ సబ్ కమిటీ ప్రశంసించింది. డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో బుధవారం కమిటీ ప్రతినిధులు పర్యటించి.. అధికార భాష అమలు తీరును పరిశీలించారు. అధికారిక కార్యకలాపాలు, ఇతర విభాగాల్లో రాజభాష ప్రయోగాన్ని వీరు ప్రత్యక్షంగా పరీక్షించారు. ఇప్పటి వరకు అధికారిక భాషపై శిక్షణ పొందని సిబ్బందిని గుర్తించి.. శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. తరచుగా సిబ్బందికి హిందీపై వర్క్‌షాప్‌లు నిర్వహించాలని, స్థానిక భాషలతోపాటు హిందీలో కూడా ప్రకటనలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. అధికారిక భాష అమలులో వాల్తేర్ డివిజన్ అనుసరిస్తున్న పద్ధతులను అభినందించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌కు కమిటీ కన్వీనర్ రంజన్ బెన్ భట్ ప్రశంసాపత్రం అందించారు. ఏడీఆర్ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ ఈస్ట్‌కోస్ట్ రైల్వే రాజభాష అధికారి ఎల్లీన పండా, వాల్తేర్ డివిజన్ రాజభాష ఇన్‌చార్జి ఎ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్లో అభివృద్ధి పనులకు ఆమోదం

- రూ.7.30 కోట్లతో తాగునీటి పథకానికి డీపీఆర్ తయారీ





సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, అరకొరగా హాజరైన కౌన్సిల్ సభ్యులు

యలమంచిలి: పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గురువారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపారు. యలమంచిలి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తొలుత 11 అంశాలతో కూడిన అజెండాను మున్సిపల్ కమిషనర్ కె.వీరయ్య సభ్యులకు చదివి వినిపించారు. పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న బలహీన వర్గాలకు చెందిన హౌసింగ్ కాలనీల్లో నీటి సరఫరా పనులకు వీటిలో రూ.7.30 కోట్లతో తాగునీటి పథకం నిర్మాణానికి డీపీఆర్‌కు ఆమోదం తెలిపారు. పట్టణంలో డ్రైన్లు, రహదారులు, సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణం, మౌలిక సదుపాయాల కొరకు నిధుల కేటాయింపుపై సభ్యులు తీర్మానించారు. కౌన్సిల్ సమావేశానికి సభ్యుల హాజరు అరకొరగానే ఉండటంతో, సమావేశం త్వరితగతిన ముగిసింది. అన్ని అంశాలకూ సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అత్రెపు గుప్తా, కౌన్సిల్ సభ్యులు షేక్ సయ్యిద్‌బీబీ, తహసీల్దార్ రాణీ అమ్మాజీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, టీపీవో శ్రీలక్ష్మి, ఆర్‌వో నీలిమ, మున్సిపల్ ఉద్యోగులు, అధికారులు అన్ని శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్‌ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

ఆరిలోవ (విశాఖ): స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ ఎస్‌ఐల నియామకాల్లో భాగంగా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షల కోసం విశాఖ రేంజ్ పోలీస్ ఉన్నతాధికారులు గురువారం ఏర్పాట్లు పూర్తి చేశారు. కైలాసగిరి ప్రాంతం ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానం ఇందుకు సిద్ధమైంది. శుక్రవారం నుంచి సెప్టెంబర్ 23 వరకు దేహదారుఢ్య పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. విశాఖ రేంజ్ పరిధి అటు శ్రీకాకుళం జిల్లా నుంచి ఇటు గోదావరి జిల్లాల వరకు అభ్యర్థులకు ఇక్కడే దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ఇటీవల నిర్వహించిన ప్రాథమిక రాత పరీక్షలో 17,374 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వారిలో 2,745 మంది మహిళా అభ్యర్థులున్నారు. వారంతా ఇప్పుడు నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షకు అర్హత సాధించారు. మహిళా అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 2 వరకు దేహదారుఢ్య పరీక్ష నిర్వహించనున్నారు.

పోలీస్ అధికారులు వారికోసం కూడా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. అభ్యర్థుల ఎత్తు, ఛాతి కొలతలతో పాటు లాంగ్ జంప్, హై జంప్, జావలిన్ త్రో, డిస్కస్ త్రో, పరుగు పోటీలు తదితర పరీక్షలు నిర్వహించనున్నారు. ఒక్కో ఈవెంట్ కోసం వేర్వేరుగా టెంట్లు వేసి విభాగాలు ఏర్పాటు చేశారు. కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద అభ్యర్థులు ఎటు వెళ్లాలో రూటు మ్యాప్‌తో పాటు రిక్రూట్‌మెంట్ బోర్డు అమర్చారు. ఏర్పాట్లును గురువారం అనకాపల్లి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ అధికారులుతో కలిసి పర్యవేక్షించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు.

ఎస్ఎల్‌పీఆర్ ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానంతో చర్యలు చేపట్టామన్నారు. అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీల్లో హాల్ టికెట్, కాల్ లెటర్, అప్లికేషన్, ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఉదయం 5 గంటలకు హాజరుకావాలని ఆయన సూచించారు.


నక్కపల్లి : చంద్రయాన్ అక్షర క్రమంలో కూర్చొన్న విద్యార్థినులు

ఇస్రోకు విద్యార్థుల వందనం


కె.కోటపాడు : పిరమిడ్ రూపంలో జెండాలతో నిల్చొన్న విద్యార్థులు


కె.కోటపాడు : ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలుపుతున్న విద్యార్థులు


నక్కపల్లి : జాతీయజెండా చేతపట్టి అభినందనలు తెలుపుతున్న విద్యార్థులు


చోడవరం రూరల్ : చంద్రయాన్ విజయంలో కృషి చేసిన శాస్త్రవేత్తలకు శాల్యూట్ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కె.కోటపాడు : చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతంతో కె.కోటపాడులోని ఒక ప్రైవేటు పాఠశాల విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. పాఠశాలలో గురువారం విద్యార్థులు పిరమిడ్ రూపంలో నిల్చొని జాతీయ జెండాలను చేతబూని ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ పాల్గొన్నారు.

చంద్రయాన్‌తో ఇనుమడించిన భారత ఖ్యాతి

చోడవరం రూరల్ : విద్యార్థులు తమ విద్యాభ్యాసంలోనే శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలని గవరవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.జె.సుందర్‌సింగ్ ఆకాంక్షించారు. చంద్రయాన్ ప్రయోగం విజయవంతం కావడం పట్ల గురువారం పాఠశాలలో శాస్త్రవేత్తలకు వందనం...కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల పరేడ్ గ్రౌండ్‌లో భరత మాత చిత్రపటాన్ని ఆవిష్కరించి, జాతీయపతాకంతో గౌరవ వందనం చేశారు. చంద్రయాన్ విజయంతో భారత దేశ ఖ్యాతి ఖండాంతరాలలో వ్యాపించిందని ప్రధానోపాధ్యాయుడు సింగ్ అన్నారు. ఉపాధ్యాయులు రవిశంకర్, రమణి, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు విశ్వనాథ్ చంద్రయాన్ ప్రయోగం తీరును విద్యార్థులకు వివరించారు. గ్రామానికి చెందిన కొమ్మనమంచి భరద్వాజ్ శ్రీహరికోట రాకెట్ ప్రయోగశాలలో శాస్త్రవేత్తగా విధులు నిర్వహిస్తున్నందున గ్రామం తరపున ఆయనకు ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. భరద్వాజ్ తాతయ్య సత్యంపంతులు విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ అప్పలనాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది శాస్త్రవేత్తల కృషికి శాల్యూట్ చేశారు.

గురుకులంలో చంద్రయాన్ సంబరాలు

నక్కపల్లి: మండల కేంద్రంలో బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గురువారం చంద్రయాన్-3 సంబరాలు జరిగాయి. ఇస్రో ప్రయోగించిన రాకెట్ చంద్రునిపై విజయవంతంగా దిగడం ఎంతో ఆనందంగా ఉందని భారత కీర్తి ప్రతిష్టలు ప్రపంచ నలుమూలలా వ్యాప్తి చెందాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. చంద్రయాన్ అనే అక్షర రూపంలో విద్యార్థులు కూర్చొని అభినందనలు తెలిపారు. జాతీయ జెండాను చేత పట్టుకుని సెల్యూట్ చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుమారి, వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. రాజయ్యపేట పాఠశాలలో కూడా చంద్రయాన్ సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండా చేత పట్టి ఇస్రోకు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి హేమంత్


చూచుకొండ పీహెచ్‌సీని సందర్శిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి హేమంత్

మునగపాక : చూచుకొండ పీహెచ్‌సీని గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎ.హేమంత్ సందర్శించారు. ఆస్పత్రిలోని రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రి ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. గణపర్తిలోని విలేజ్ క్లినిక్‌తో పాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పిల్లలకు, బాలింతలు, గర్భిణులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని, మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వైద్యాధికారులు ఎస్తేర్‌రాణి, వినోద్‌బాబు, ఎంపీహెచ్ఈవో శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌ఎస్‌లు బేగం, ఎస్.అప్పలనాయుడు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మద్యం మత్తులో మున్సిపల్ కమిషనర్ కారును ఢీకొన్న ఆటో డ్రైవర్

- మూడు కేసులు నమోదు

నర్సీపట్నం : మున్సిపల్ కమిషనర్‌పై దురుసుగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్‌పై టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. టౌన్ ఎస్ఐ సుధాకర్ అందించిన వివరాలివి. మున్సిపల్ కమిషనర్ కనకారావు తన వాహనంలో కార్యాలయానికి వెళ్తుండగా శ్రీకన్య జంక్షన్ వద్ద మద్యం మత్తులో ఉన్న ఆటోడ్రైవర్ సాయి గణేష్ కమిషనర్ కారును ఢీ కొట్టాడు. అంతేకాకుండా కమిషనర్‌పై దురుసుగా ప్రవర్తించాడు. దీంతో సుమారు గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కమిషనర్ ఫిర్యాదు చేయడంతో ఆటో డ్రైవర్‌పై 336 ఐపిసి (ర్యాష్ డ్రైవింగ్, నిర్లక్ష్యం), డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు, 279 ఐపిసి సెక్షన్లతో మూడు కేసులు నమోదు చేశారు.

నేత్రదానంతో రెండు జీవితాలకు వెలుగు

- నేటి నుంచి పక్షోత్సవాలు ప్రారంభం
- జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం
- ప్రజల్లో నెలకొన్న అపోహలు తొలగించే ప్రయత్నం
- వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా అవ్వాతాతల కంటిచూపునకు రక్షణ


దాత నుంచి నేత్ర సేకరణ చేస్తున్న వైద్యులు


కార్నియల్(నల్లపార) వల్ల అంధత్వం సోకిన కన్ను

నక్కపల్లి : నేత్ర దానం అనేది ఇద్దరి జీవితాలకు వెలుగు నిస్తుంది. ఎంతో మంది కంటి చూపులేక లోకాన్ని చూడలేకపోతున్నారు. మరికొంతమంది జీవితం మధ్యలో కంటి చూపుకోల్పోతున్నారు. ఇటువంటి వారికి దాతలు చేసే నేత్రదానం వల్ల అంధుల జీవితాల్లో వెలుగులు ప్రసాదించవచ్చు. నేత్రదానంపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం 15 రోజుల పాటు పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. ప్రతి ఏటా ఆగష్టు 25 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు నేత్రదానంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా నేత్ర సంరక్షణ, నేత్రదానం అనే విషయాలపై జిల్లాలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, ఆప్తాలమిక్ సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తూ, ప్రచారం చేయడానికి జిల్లా అంధత్వ నివారణ సంసథ ఏర్పాట్లు చేసింది. పాఠశాలల్లో నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం, కరపత్రాలు, బ్యానర్లు, వాల్‌పోస్టర్ల ద్వారా విస్తృత ప్రచారం చేయడానికి ఏర్పాట్లు చేసినట్టు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ రమణ కుమార్ తెలిపారు. నేత్రదానంపై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించే కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. నేత్రదానం అంటే ఏమిటి, ఎవరు చేయాలి.. అనే విషయాలు వివరించారు.

నేత్రదానం అంటే..

మనిషి మరణానంతరం 6 గంటల లోపు కంటిలోని కార్నియా (నల్లగుడ్డు పైపొర)ను తీసి వేరొకరికి అమర్చడాన్ని(కార్నియల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ లేదా కెరటోప్లాస్టీ) నేత్రదానం అంటారు.

నేత్రదానం ఎవరికి అవసరం..

పౌష్టికాహారలోపం, ఇన్ఫెక్షన్లు, కెమికల్ బర్న్స్, కంజెనిటల్ డిజాస్టర్(పుట్టుకతో వ చ్చేలోపాలు, ఆపరేషన్ తర్వాత నల్లగుడ్డుపై పొర దెబ్బతిన్న వారికి అవసరం. దృష్టి దోషాల వల్ల కళ్లద్దాలు వాడే వారు, చక్కెర వ్యాధి, రక్తపోటు, గుండెపోటు, ఆస్తమా, క్షయలాంటి వ్యాధులున్నవారు, కాటరాక్ట్ ఆపరేషన్ చేయించుకున్నవారు ప్రమాదాల్లో మరణించిన వారు నేత్రదానం చేయవచ్చు.

నేత్రదానానికి ఎవరి నేత్రాలు పనికిరావు..

ఎయిడ్స్, పచ్చకామెర్లు, రేబిస్, పాముకాటు, బ్లడ్ క్యాన్సర్, వ్యాధులున్న వారి నేత్రాలు పనికిరావు. కళ్లను వ్యక్తి మరణానంతరం మాత్రమే దానం చేయగలరు. వయసుతో సంబంధం లేదు. గ్లకోమా, రెటీనా వ్యాధులు కలిగిన వారు కూడా దానం చేయవచ్చు. వ్యక్తి మరణించిన వెంటనే ఐ బ్యాంకుకు సమాచారం ఇవ్వాలి. 6 గంటల వ్యవధిలోపు వ్యక్తి నుంచి కళ్లను తొలగించాలి. ఐ బ్యాంకు బృందం నేత్రదానం ఇచ్చే వ్యక్తి ఇంటికైనా హాస్పిటల్‌కైనా మార్చురీకైనా చివరకు శ్మశానానికైనా వెళ్లి తీసుకుంటుంది. ఒక్క కార్నియా మాత్రమే తొలగించబడుతుంది. ముఖం ఏమాత్రం చెదరదు. ఇది 20 నిమిషాలు మాత్రమే సమయం తీసుకుంటుంది.

దాతలు సంప్రదించాలంటే..

అనకాపల్లి జిల్లాలో ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో మోహిసిన్ ఐ బ్యాంక్ నేత్రాలను సేకరిస్తోంది. నేత్రదానం చేసే ఆసక్తి ఉన్న వారు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు 9246624000, 0891- 67145050 , 9440821919 ఈ ఐ బ్యాంక్ 24 గంటలు అందుబాటులో ఉంటుంది.

త్వరలో ఎన్టీఆర్ వైద్యాలయంలో ఐబ్యాంకు ఏర్పాటు

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇంతవరకు 150 మంది మరణానంతరం నేత్రదానం చేశారు. అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో త్వరలో ఐ బ్యాంకును నెలకొల్పేందుకు మోహిసిన్ ఐ బ్యాంక్ ముందుకు వచ్చిందని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం అధికారి రమణకుమార్ తెలిపారు.

నేత్రదానం, సంరక్షణపై విస్తృత ప్రచారం



జిల్లాలో వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా లక్షలాది మందికి వైద్య పరీక్షలు నిర్వహించి కంటి చూపును కాపాడడం జరుగుతోంది. అలాగే నేత్ర దానం , నేత్ర సంరక్షణపై అవ్వాతాతలకు అవగాహన కల్పిస్తున్నాం . నేత్రదానం కూడా ఎంతో గొప్ప విషయం. ఒకరు చేసే నేత్రదానం మరో ఇద్దరి జీవితాల్లో వెలుగును ప్రసాదిస్తుంది. నేత్రదానంపై ప్రభుత్వం 15 రోజుల పాటు పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, ఆప్తాలమిక్ సిబ్బంది, కరపత్రాలు, విద్యార్థులతో ర్యాలీల ద్వారా నేత్రదానం, సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ నేత్రదానంపై ప్రజల్లో నెలకొన్న అపోహలు తొలగిస్తున్నాం. దీనికి ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలి.

–రమణకుమార్, ప్రోగ్రాం అధికారి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ

రూ.16 కోట్లతో జగనన్న లేఅవుట్లకు ముఖద్వారాలు

- మరుగుదొడ్డికి రూ.12 వేలు,
- ఇంకుడుగొయ్యికి రూ.6వేలు అదనంగా మంజూరు
- జిల్లా హౌసింగ్ డీఈ ప్రసాద్

నాతవరం: జిల్లాలో జగనన్న లేఅవుట్లకు 260 ముఖద్వారం నిర్మాణాలకు ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు చేసిందని జిల్లా హెడ్ క్వార్టర్ హౌసింగ్ డీఈ కె.వి.ప్రసాద్ అన్నారు. ఆయన గురువారం నాతవరం, ములగపూడి గ్రామాల్లో జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలించి లబ్ధిదారుల సమస్యలు తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించిన వారికి బిల్లులు వెంటనే ఇస్తామని అన్నారు. తర్వాత అధికారులతో మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 682 జగనన్న లేఅవుట్లు ఉండగా మొదట విడతలో 15,735 మందికి ఇళ్ల మంజూరు చేశామన్నారు. ప్రస్తుతం 15,700 పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశామని, ఈనెలాఖరుకు శత శాతం ఇళ్ల నిర్మాణం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జగనన్న లేఅవుట్లలో 25 ఇళ్లు దాటిన లేఅవుటుకు ప్రభుత్వం ముఖద్వారం నిర్మాణం చేస్తుందన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్డి నిర్మించుకోవడానికి అదనంగా రూ. 12 వేలు, ఇంకుడు గొయ్యి తీసుకునేందుకు రూ.6వేలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. అలాగే ఉచితంగా విద్యుత్ మీటరు, ఇంటికి తాగునీటి కళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం, నాతవరం మండలాల హౌసింగ్ జేఈలు నాయుడు, జోగారావు సిబ్బంది పాల్గొన్నారు.

పాము కాటుకు గురై యువకుడి మృతి


పాముకాటుకు గురై మృతిచెందిన శంకర్ గణేష్ (ఇన్‌సెట్) శంకర్ గణేష్ (ఫైల్)

మునగపాక : కుటుంబానికి పెద్దదిక్కుగా నిలుస్తాడని ఆశించిన కుటుంబానికి తీరని అన్యాయం జరిగింది. అందరితో సరదాగా ఉండే ఆ యువకుడు పాముకాటుకు గురై మృతి చెందాడు. దీంతో మూలపేటలో విషాదం అలముకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మూలపేటకు చెందిన మొల్లేటి పరమేష్-మాణిక్యం దంపతులకు ముగ్గురు కుమారులు. పరమేష్ ఇటుకబట్టీ నిర్వహిస్తూ కుటుంబ పోషణ సాగిస్తున్నాడు. పరమేష్ పెద్ద కుమారుడు శంకర్ గణేష్(21) తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటూ ట్రాక్టర్ నిర్వహణ చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం ట్రాక్టర్‌కు డీజిల్ తీసుకువెళ్లే క్రమంలో తన బైక్‌పై గంగాలమ్మ తల్లి గుడి వరకు వెళ్లి అక్కడ బైక్‌ను వదిలేసి కొంతదూరం నడుచుకొని వెళ్లాడు. ఈ క్రమంలో గణేష్‌ను పాము కాటు వేసింది. డీజిల్ పట్టుకెళ్లిన కొడుకు ఎంతకూ రాకపోవడంతో కంగారు పడ్డ తండ్రి పరమేష్ ఇతరులకు సమాచారం అందించారు. కుమారుడు గణేష్ ఫోన్ నంబరుకు ఎంత డయల్ చేసినా స్పందన రాకపోవడంతో బైక్ వదిలిన ప్రదేశం నుంచి కొంతదూరం వెళుతుండగా మార్గమధ్యంలో గణేష్ కిందపడి ఉండడాన్ని గమనించారు. అప్పటికే పాము కాటుకు గురై గణేష్ మృతిచెందడాన్ని గుర్తించి మునగపాక పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గురువారం గణేష్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. గణేష్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గణేష్ అంత్యక్రియలు మూలపేటలో గురువారం మధ్యాహ్నం జరిగాయి. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి వెళ్లి పంచనామా వేగవంతమయ్యేలా చర్యలు తీసుకున్నారు. గణేష్ తండ్రి పరమేష్‌ను ఓదార్చారు.

బాల్య వివాహానికి వ్యతిరేకంగా కౌన్సెలింగ్


నిర్వాహకులకు కౌన్సెలింగు ఇస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమ, మహిళా సంరక్షణ కార్యదర్శి

రోలుగుంట: మండల కేంద్రంలో శ్రీవిజ్ఞాన్ కేంద్రం సమీపంలో ఈ నెల 30న బాల్యవివాహం జరగనుందన్న సమాచారంతో విలేజి లెవల్ చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ కమిటీ గురువారం ఇక్కడకు వచ్చింది. వధూవరుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. బాలిక తల్లిదండ్రుల వద్ద ఆమె పుట్టిన తేదీ ధ్రువపత్రం తీసుకుని బాలికకు 17 సంవత్సరాలుగా నిర్ధారించుకున్నారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు, చట్టపరమైన చర్యల గురించి కౌన్సెలింగ్ ఇచ్చారు. చట్టాన్ని గౌరవించి ఈ వివాహం చేసే ఆలోచన విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. చట్టాన్ని అతిక్రమిస్తే ఎదురవనున్న పరిణామాల గురించి విశదీకరించారు. ఇక్కడ విలేజిలెవల్ చైల్డ్ ప్రొహిబేషన్ కమిటీ ప్రతినిదిలు ఐసీడీఎస్ నుంచి సూపర్‌వైజర్ హైమ, మహిళా సంరక్షణ కార్యదర్శి కె.లక్ష్మీదేవి, వీఆర్వో ఎస్.కె.ఎస్.సాహెబ్, ఎన్జీవో ప్రతినిధులు ఎస్.పుష్ప, డి.గణపతమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు దివ్య, సత్యవతి పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యంకు ఆరోహన్ సోషల్ ఇన్నోవేషన్ అవార్డు



ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి నుంచి అవార్డు అందుకుంటున్న సుబ్రహ్మణ్యం

అక్కిరెడ్డిపాలెం(గాజువాక): ఆరోహన్ సోషల్ ఇన్నోవేషన్ అవార్డు-2023 సుబ్రహ్మణ్యం ప్రసాద్ కైవసం చేసుకున్నారు. హెల్త్ కేర్ విభాగం నుంచి ఎన్‌లైట్ 360 ఇన్నోవేటర్‌కు సుబ్రహ్మణ్యం ప్రసాద్ అవార్డుకు ఎన్నికయ్యారు. గ్రాంట్ ప్రైజ్ మనీ కింద రూ.50 లక్షల అవార్డును బెంగుళూరులోని ఓ ప్రైవేట్ హోటల్లో ఇన్ఫోసిస్ ఫౌండర్ చైర్‌పర్సన్ సుధామూర్తి చేతుల మీదుగా అందుకున్నారు. సుబ్రహ్మణ్యం హెల్త్ కేర్ విభాగంలో తయారు చేసిన ఎన్‌లైట్ 360 ఇన్నోవేటర్‌కు ఈ గుర్తింపు లభించింది. ఇదిలావుండగా అవార్డు గ్రహీత సుబ్రహ్మణ్యం 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం నివాసి. భెల్ (హెచ్‌పీవీపీ) విశ్రాంత ఉద్యోగి ముద్దం చిన నాగయ్య, నీలవేణి దంపతుల రెండో కుమారుడు. హైదరాబాద్‌లో ఐఐటీ పూర్తి చేసిన సుబ్రహ్మణ్యం తర్వాత పరిశోధనలతో ఎన్‌లైట్ 360 ఇన్నోవేటర్‌తో పరిచయమయ్యారు. ఎన్‌లైట్ 360 ఇన్నోవేటర్ ప్రొడక్స్ తయారీకు సుబ్రహ్మణ్యం ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి అనుమతులకు ప్రయత్నిస్తున్నారు. అవార్డు కార్యక్రమంలో ఇండియన్ టాయ్ ఇన్వెంటర్ అండ్ సైన్స్ ఎక్స్‌పర్ట్ పద్మశ్రీ అరవింద్ గుప్తా, ఎన్ఐఎంహెచ్ఏఎన్ఎస్ మనోరోగచికిత్స విభాగం డైరెక్టర్ అండ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ డాక్టర్ ప్రతిమా మూర్తి, ఇన్ఫోసెస్ ఫౌండర్ ట్రస్టీ సుమిత్ వర్మనీ, కోశాధికారి సునీల్ కుమార్ దర్శవార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిందితుడికి పదేళ్ల జైలు

విశాఖ-లీగల్ : లారీలో గంజాయి తరలిస్తున్న వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ విశాఖ మెట్రోపాలిటిన్ సెషన్స్ జడ్జి ఎస్.శ్రీదేవి గురువారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతోపాటు రూ.1.50,000 జరిమానా చెల్లించాలని, లేనిపక్షంలో అదనంగా ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో స్పష్టం చేశారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.వేణుగోపాలరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు సింగ్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఆమ్ రహో జిల్లాకు చెందినవాడు. వృత్తి రీత్యా లారీ డ్రైవర్. 2020 డిసెంబర్ 21న సాయంత్రం గాజువాక సమీపంలోని అగనంపూడి టోల్ గేటు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. గాజువాక వెళుతున్న లారీలో 1,925 కిలోల గంజాయి కనుగొన్నారు.

పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని నిందితుడ్ని అరెస్టు చేశారు. లారీలోని గంజాయిని ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టర్‌కు అప్పగించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి


మైబోయిన అప్పలనాయుడు(49)

కశింకోట : నూతలగుంటపాలెం శివారు త్రిపురవానిపాలెం కూడలి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కూలీ దుర్మరణం చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి అందించిన వివరాలివి. మండలంలోని నరసింగబిల్లి నుంచి త్రిపురవానిపాలెం గ్రామానికి వెళుతున్న టీవీఎస్ 50 మెబైల్ వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొంది. దీంతో టీవీఎస్ నడుపుతున్న త్రిపురవానిపాలేనికి చెందిన మైబోయిన అప్పలనాయుడు(49), తనతోపాటు తీసుకు వెళుతున్న మనుమడు మొల్లి అఖీష్ తీవ్రంగా గాయపడ్డారు. వీరితోపాటు బైక్ నడుపుతున్న వ్యక్తి కూడా గాయపడ్డాడు. వీరిని అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అప్పలనాయుడు మృతి చెందాడు. అఖీష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి హెయిర్ కటింగ్ చేయడానికి బార్బర్ షాపునకు నరసింగబిల్లి తీసుకెళ్లి తిరిగి త్రిపురవానిపాలెం గ్రామం వెళుతుండగా ప్రమాదం జరిగింది. కూలీ పని చేసుకొని కుటుంబాన్ని పోషించే అప్పలనాయుడుకు భార్య గంగతల్లి, ముగ్గురు కుమార్తెలున్నారు. ఒకరికి పెళ్లి కాగా, మిగిలిన వారికి వివాహం కాలేదు. కుటుంబానికి పెద్ద దిక్కు అయిన అప్పలనాయుడు మృతి చెందడంతో కుటుంబం విషాద సాగరంలో మునిగిపోయింది. ఈ సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

యజమానిని హత్య చేసిన వాచ్‌మన్‌కు జీవిత ఖైదు

విశాఖ లీగల్ : అపార్టుమెంటు యజమానిని అతి కిరాతకంగా హత్య చేసిన కాపలాదారునికి జీవిత ఖైదు విధిస్తూ నగరంలోని నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.శ్రీహరి గురువారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతోపాటు రూ. వెయ్యి జరిమానా చెల్లించాలని, లేనిపక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బర్కత్ ఆలీ ఖాన్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు బంగారు నాయుడు అక్కయ్యపాలెం నందగిరి నగర్ దగ్గర్లోని ఒక అపార్టుమెంటులో వాచ్‌మన్‌గా పని చేసేవాడు. అదే అపార్టుమెంటులో మొదటి అంతస్తులో కప్పల ప్రకాష్ దాస్ ఉండేవాడు. దాస్ జాతకాలు చెబుతూ ఒక్కడే ఉండేవాడు. ప్రకాష్ రాజ్ కుమారుడు అశోక్ కుమార్ ఉద్యోగ రీత్యా గాజువాకలో నివాముంటున్నాడు. ప్రతిరోజు సాయంత్రం అశోక్ తన తండ్రికి ఫోన్ చేసి మాట్లాడేవాడు. 2013 ఆగస్టు 19వ తేదీన సాయంత్రం అశోక్ తన తండ్రికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. రాత్రి 11 గంటల వరకు ఫోన్ చేసినా ప్రయోజనం లేకపోయింది. అనుమానంతో నందగిరి నగర్‌కు వచ్చిన ఇంటితోపాటు చుట్టుపక్కల గాలించారు. ప్రయోజనం లేకపోయింది. ఇంట్లో బంగారు వస్తువులు కనిపించలేదు. ఇల్లంతా చిందర వందరగా ఉంది. ఆగస్టు 20వ తేదీన అపార్ట్‌మెంట్ సమీపంలో ఓ వ్యక్త హత్యకు గురయ్యాడని స్థానికులు గుర్తించారు. ఈ సమాచారం అందుకున్న నాలుగో పట్టణ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని చూసిన అశోక్ తన తండ్రిదిగా గుర్తుపట్టారు. వెంటనే పోలీసులు జాగిలాలను రంగంలోకి దించారు. ప్రకాష్ దాస్ ఉంటున్న ఇంట్లో రక్తపు మరకలు ఉన్నట్లు కుక్కలు గుర్తించాయి. అవి అక్కడి నుంచి తిన్నగా వాచ్‌మన్ బంగారు నాయుడు ఇంట్లో వరకు వెళ్లాయి. అక్కడ రక్తపు మరకలనూ గుర్తించాయి. పోలీసు పరీక్షల్లో అవి ప్రకాష్‌దాస్‌వి అని నిర్ధారణ అయింది. నాటి ఫోర్త్ టౌన్ సీఐ అప్పలనాయుడు కేసు దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో బంగారు నాయుడుకు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

క్లుప్తంగా

నేడు బాబా ఆలయ దశమ వార్షికోత్సవం



షిర్డీ సాయిబాబా ఆలయం

కశింకోట : మండలంలోని పల్లపు సోమవరంలో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయ దశమ వార్షికోత్సవం శుక్రవారం పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త గొంతిన శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, హోమం నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం జరుపుతామన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, సాయిబాబా భజన బృందంతో భజన, రేలా రే రేలా వంటి సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

ముళ్లపొదలతో ముప్పు



వంతెన మీద నుంచి రోడ్డు మీదకు విస్తరించిన ముళ్ల పొద

తుమ్మపాల : అసలే ఇరుకు వంతెన.. ఆపై ముళ్ల పొద రోజురోజుకు పెరుగుతూ వంతెనపై రోడ్డు మీదకు పాకడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే అనకాపల్లి–సబ్బవరం రోడ్డులోని రైల్వే వంతెనపై ముళ్లపొద వాహన చోదకులను ప్రమాదాల పాలు చేస్తోంది. అనకాపల్లికి కూతవేటు దూరంలో జీవీఎంసీ పరిధిలోకి వచ్చే ఈ వంతెన శుభ్రతను ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఈ వంతెనకు ఇరువైపులా ముళ్లపొదలు పెరిగి రోడ్డును మూసివేస్తున్నాయి. వీటికి ముళ్లు ఉండటంతో ద్విచక్ర వాహన చోదకులు పలుమార్లు గాయపడ్డారు. వీటిని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

అనకాపల్లిటౌన్ : సీసీ రోడ్డు పనులను అడ్డుకున్న ఇద్దరు వ్యక్తులపై పట్టణ పోలీసులకు గురువారం ఫిర్యాదు అందింది. ఈ విషయమై పట్టణ ఎస్‌ఐ సత్యనారాయణ అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో ఉమ్మలాడ ప్రభుత్వ స్థలంలో సీసీ రోడ్డు నిర్మిస్తుండగా జగదీష్, చందు పనులను అడ్డుకున్నారంటూ తహసీల్దార్ గంగాధర్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 109 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,360	4,650
రెండో రకం	4,030	4,090
మూడోరకం	3,200	3,970

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
ఏం చేస్తున్నావ్	: సత్యనారాయణ స్క్రీన్-1
దక్ష	: సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	: షిర్డిసాయి
కింగ్ ఆఫ్ కోథా	: పర్లిసాయి
గాండీవధారి అర్జున	: వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	: శ్రీసత్య
బేదురులంక 2012	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 47 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. 'ఎ' పాజిటివ్-4 యూనిట్లు, 'బి' పాజిటివ్-15 యూనిట్లు, 'ఒ' పాజిటివ్ 24 యూనిట్లు, 'ఒ' నెగెటివ్-1 యూనిట్, 'ఎబి' పాజిటివ్-3 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్య (9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 426 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 351 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

జీవీఎంసీ స్టేడియంకు మోక్షం

- క్రీడాకారిణుల కోసం విశ్రాంతి భవనం
- వ్యాయామశాలల నిర్మాణం
- భవన నిర్మాణానికి రూ. 70 లక్షలు మంజూరు చేసిన ఎంపీ సత్యవతి



స్టేడియంలో పిల్లర్ల స్థాయిలో జరుగుతున్న నిర్మాణ పనులు (ఇన్‌సెట్) నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీటి మోటారు

అనకాపల్లిటౌన్ : జీవీఎంసీ స్టేడియంలో క్రీడాకారిణుల విశ్రాంతి కోసం రూ.70 లక్షలతో రెండంతస్తుల భవనంతో పాటు వ్యాయామశాల నిర్మాణానికి ఎంపీ బీవీ సత్యవతి నిధులు విడుదల చేశారు.

స్టేడియంకు జాతీయ గుర్తింపు..

ఈ స్టేడియంలో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలతో పాటు, పలువురు రాజకీయ ఉద్ధండుల సభలు కూడా జరిగాయి. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఎన్నికల సభ నిర్వహణతో పాటు స్వాతంత్ర్య సమరయోధుల సమావేశాలు జరుపుకున్న ఘనత ఈ క్రీడా మైదానానికి ఉంది. ఈ క్రీడా మైదానానికి ఎన్టీఆర్ క్రీడా మైదానంగా నామకరణం చేశారు. అప్పటి నుంచి మైదానం అభివృద్ధికి నోచుకోలేదనే చెప్పాలి. రాజకీయ సభలు, సమావేశాలు, వివాహాలకే పరిమితమవుతూ వస్తోంది. ప్రాముఖ్యత సంతరించుకున్న స్టేడియంను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది.

వసతుల లేమి..

ఈ స్టేడియంలో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు జిల్లాతో పాటు పక్క జిల్లాల నుంచి కూడా క్రీడాకారులు వస్తుంటారు. అటువంటి సమయంలో క్రీడాకారిణులు వసతుల లేమితో ఇబ్బంది పడేవారు. కొంత మంది పట్టణంలో ఉన్న లాడ్జిలను ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఎదుయ్యేవి. స్టేడియం ప్రభుత్వానికి సంబంధించిదే అయినప్పటికీ ఎటువంటి వసతులు లేకపోవడంతో క్రీడాకారిణులు ఇక్కడ పోటీలకు హాజరు కావాలంటే అయిష్టత చూపేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్రీడాకారిణుల సమస్యపై దృష్టి సారించింది. ఎంపీ బీవీ సత్యవతి తన నిధుల నుంచి క్రీడాకారిణుల కోసం రెండంతస్తుల విశ్రాంతి భవనం, వ్యాయామశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మంచినీటి సదుపాయం కోసం ఇప్పటికే నూతన మోటారు ఏర్పాటు చేశారు.

గ్యాలరీ వెనుక నూతన భవనం..

క్రీడా మైదానం గ్యాలరీల వెనుక ఖాళీగా ఉన్న కొంత స్థలంలో క్రీడాకారిణుల కోసం భవనం ఏర్పాటు చేయాలని జిల్లా ప్రాధికార సంస్థ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. వెంటనే ఎంపీ సత్యవతి తన నిధుల నుంచి రూ. 70 లక్షలు మంజూరు చేయటమే కాకుండా గతవారం పనులను ప్రారంభింపజేశారు. ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. భవనం దిగువ భాగంలో క్రీడాకారుల ఆట పరికరాలు భద్రపరిచేందుకు ఒక అంతస్తు, మరో అంతస్తులో విశ్రాంతి గదులు, వ్యాయామశాల కోసం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. భవన నిర్మాణాలు పూర్తయిన వెంటనే స్టేడియంలో సెక్యూరిటీ గార్డ్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానించనున్నారు. ఇటు మైదానానికి రక్షణతో పాటు అటు క్రీడాకారిణుల సెక్యూరిటీ కోసం ఇప్పటికే జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ వడివడిగా అడుగులు వేస్తోంది.

శరవేగంగా పనులు..



వారం రోజుల క్రితం మైదానంలో క్రీడాకారిణుల వసతి కోసం పనులు ప్రారంభించాం. ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే పిల్లర్స్ స్థాయికి చేరుకున్నాయి. నూతనంగా మంచినీటి మోటారు అందుబాటులోకి తీసుకొచ్చాం. మరో ఆరు నెలల్లో రెండు భవనాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

–జెడ్సీ చక్రవర్తి

రూ. 17 కోట్లతో ప్రాధాన్యతా భవనాలు



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

- సెప్టెంబరు 15లోగా పనులు పూర్తి చేయండి
- ప్రజాప్రతినిధులు, అధికారులతో ఎంపీపీ సమీక్ష

అనకాపల్లి రూరల్ : మండలంలో ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు కోరారు. గురువారం అనకాపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచులు, ఎంపీటీసీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి నిర్మాణాల పురోగతిపై సమీక్ష జరిపారు. మండలంలో సుమారు రూ.17 కోట్లతో 26 సచివాలయాలు, 24 ఆర్బీకేలు, 23 వెల్‌నెస్ సెంటర్ల పనులు ఏ దశలో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. వీటిలో ఇప్పటికే 12 సచివాలయాలు, 8 ఆర్బీకేలు, 8 వెల్‌నెస్ కేంద్రాల భవనాల పనులు పూర్తి అయినట్టు అధికారులు తెలిపారు. మిగిలిన పనులు పూర్తి చేయడానికి సెప్టెంబరు 15 తుది గడువుగా విధించినట్టు ఎంపీపీ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక విజన్‌తో గ్రామాల్లోనే ప్రజలకు అన్ని సేవలు అందించాలని ముందుకు వెళ్తుందన్నారు. పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. జల్‌జీవన్ మిషన్ పనులపై కూడా ఆరా తీసిన ఎంపీపీ యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ బీశెట్టి వరాహ సత్యవతి, వైస్ ఎంపీపీలు ఐతా ఆనంద రాము, విల్లూరి సూర్యకుమారి, పంచాయతీరాజ్ డీఈఈ జె. వేణుగోపాల్, ఎంపీడీవో కేవీ నరసింహారావు, ఈవోపీఆర్డీ కె. ధర్మారావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ మురళి, పంచాయతీరాజ్ ఏఈలు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

స్టేడియంలో క్రషర్ బుగ్గి తొలగింపు

- ఆనందంలో వాకర్లు



తొలగించిన క్రషర్‌బుగ్గిని పరిశీలిస్తున్న కొణతాల భాస్కర్, వాకర్లు యడ్ల త్రినాథ్

అనకాపల్లిటౌన్ : ఇటీవల కురిసిన వర్షాలకు స్థానిక మున్సిపల్ స్టేడియంలో వాకింగ్ ట్రాక్ బురదమయంగా మారటంతో జీవీఎంసీ అధికారులు క్రషర్‌బుగ్గితో చదును చేశారు. అయితే క్రషర్ బుగ్గి గాలిలో ఎగిరి వాకర్లకు ఇబ్బంది కలిగిస్తున్న నేపథ్యంలో 'వాకింగ్ ట్రాక్‌పై క్రషర్‌బుగ్గితో వాకర్లకు ఇబ్బందులు' అనే శీర్షికన ఈనెల 22న సాక్షిలో వార్త ప్రచురితం అయింది. దీనికి జీవీఎంసీ అధికార యంత్రాంగం గురువారం స్పందించింది. స్టేడియంలో ఉన్న క్రషర్ బుగ్గిని తొలగించారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు కొణతాల భాస్కర్, వాకర్లు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

శిథిల భవనాలతో.. భయం భయం

- భయపెడుతున్న తహసీల్దార్, మండల పరిషత్, ఉప ఖజానా, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయాలు
- భవనాల నిర్మాణానికి నివేదిక పంపామంటున్న తహశీల్దార్







40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన మండల పరిషత్, ఉప ఖజానా కార్యాలయాలు..

అనకాపల్లిటౌన్ : బ్రిటీష్ పాలనలో అర ఎకరం స్థలంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ కార్యాలయం ఆవరణలో మండల పరిషత్, ఉపఖజానా కార్యాలయాలు ఏర్పాటు చేయగా, 20 సంవత్సరాల క్రితం గ్రామీణాభివృద్ధి కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఏళ్లు గడిచే కొద్దీ ఈ కార్యాలయాలు శిథిలమై అధికారులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. వివిధ పనులపై వచ్చే ప్రజలు కూడా భయపడుతున్నారు. నూతన భవనాల నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తహసీల్దార్ కార్యాలయం..

సుమారు 2 లక్షల 35 వేల మంది జనాభాకు ఒకే తహసీల్దార్ కార్యాలయం ఉండడంతో వివిధ పనులపై వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 40 నుంచి 50 వేల మందికి ఒక తహసీల్దార్ కార్యాలయం ఉండాలి. జనాభాకు తగ్గట్టుగా మండలానికి మరో తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని ప్రజలు అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరారు.

మండల పరిషత్ కార్యాలయానికి వివిధ పనులపై ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఉపఖజానా కార్యాలయానికి వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేసి పదవీ విరమణ చెందిన వారు పింఛన్లు తదితర పనుల కోసం రాకపోకలు సాగిస్తారు. వీరంతా కార్యాలయాలు శిథిలం కావటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణాభివృద్ధి అభివృద్ధి సంస్థ కార్యాలయం..

నూతన జిల్లాగా ఏర్పడిన తర్వాత జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయం ఏర్పాటు చేశారు. జిల్లాలో వివిధ మండలాలకు చెందిన అధికారులతో పాటు వివిధ పనులపై వచ్చే వారికి ఇబ్బందిగా ఉంది. మరమ్మతు చేస్తే బాగుంటుందని అంటున్నారు.

కార్యాలయాలు మార్పు చేయాలి..



రైతు పాస్‌బుక్‌ల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చాను. సకాలంలో పాస్‌బుక్‌లు అందజేశారు. ఒకే ఆవరణలో నాలుగు ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయడం మంచి పరిణామమే అయినప్పటికీ ప్రజల మనోభావాలను, ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రెండు కార్యాలయాలనైనా మరో చోటుకు మార్చాలి.

– బి.సాయి, అనకాపల్లి

ప్రభుత్వానికి నివేదిక పంపించాం..



తహసీల్దార్ భవనం శిథిలావస్థకు చేరుకున్న విషయం తెలిసిందే. ఈ విషయం ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు సకాలంలో పనులు చేసి పంపిస్తున్నాం. వర్షాలు పడుతున్న సమయంలో ఇబ్బందిగా ఉంది.

గంగాధరరావు, తహసీల్దార్, అనకాపల్లి

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

సబ్బవరం : మండలంలోని కేజీబీవీ పాఠశాలను మండల విద్యాశాఖాధికారి-2 బోలెం సూర్యనారాయణ మూర్తి గురువారం సందర్శించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తెలుసుకున్నారు. ఇన్‌చార్జి ఎస్‌వో సుధారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

కశింకోట : స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక కుంకుమార్చనలు, పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి వి. కృష్ణ తెలియజేశారు.

ఉదయం నుంచి సహస్ర నామాలు, అష్టోత్తర శతనామావళి వంటి పలు కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. అదే విధంగా స్థానిక శివాలయంలో సర్వమంగళాంబకు సాయంత్రం ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు వి. శంకరం, వి. చిదంబరం తెలియజేశారు.

విద్యార్థులకు తెలుగు పద్యాల పోటీ



రావికమతం : కిత్తంపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు గురువారం తెలుగు పద్యాల పోటీలను నిర్వహించారు. తెలుగు భాషా వారోత్సవాల సందర్భంగా తెలుగు భాషాభిమాని, ఆ క్లస్టర్ సీఆర్‌ఎంటీ రామారావు ఈ పోటీలను నిర్వహించారు. నలుగురు విజేతలను ఎంపిక చేసి బహుమతులను కూడా అందించారు.

కొంతలంలో.. : రోలుగుంట: కొంతలం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు టీచర్ సంతోషి తెలుగు భాషా వారోత్సవాలను నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 2018 సూపర్ సింగర్ విజేత ధీరజ్ పాల్గొన్నాడు. వందేమాతరం, జనగణమన ఆలపించాడు.

కళకళలాడిన వారపు సంత



పండ్లు కొనుగోలు చేస్తూ..



పూలు కొనుగోలు చేస్తూ..

- వరలక్ష్మీ వ్రతం పూజాసామగ్రి కొనుగోలు చేసిన మహిళలు
- చుక్కలనంటిన ధరలు



కశింకోట వారపు సంతలో వస్త్ర దుకాణం వద్ద మహిళల కొనుగోళ్లు

కశింకోట : కశింకోటలోని వారపు సంత గురువారం కళకళలాడింది. శ్రావణ శుక్రవారం వరలక్ష్మీదేవి వ్రతం కావడంతో పూజా సామగ్రి కొనుగోలుకు ఎక్కువ సంఖ్యలో మహిళలు తరలి వచ్చారు. దీంతో పండ్లు, వస్త్ర, పూల దుకాణాలు కిటకిటలాడాయి. యాపిల్, దానిమ్మ, బత్తాయి, నిమ్మ, అరటి పండ్లు, ద్రాక్ష, కొబ్బరికాయలు, పూల అమ్మకాలు జోరుగా సాగాయి. వీటి ధర కూడా తారాస్థాయికి చేరింది. సాధారణ రోజుల కంటె దాదాపు రెండు రెట్లు ఎక్కువకు విక్రయాలు సాగాయి. సాధారణ రోజుల్లో రూ. 30 ఉండే డజన్ అరటి పండ్లు డెబ్బై, ఎనభై రూపాయలకు, ఒక్కొక్క యాపిల్, దానిమ్మ, బత్తాయి కలిపి రూ. వందకు అమ్మకాలు జరిపారు. సాధారణ రోజుల్లో ఇవి రూ.40 ఉంటాయి. ఇక సంతలో చీర, జాకెట్లను మహిళలు ఎక్కువగా కొనుగోలు చేశారు. చీర నాణ్యతను అనుసరించి రూ.వంద నుంచి రూ.600 వరకు విక్రయాలు సాగాయి. కిరాణా దుకాణాల్లో పప్పులు, బియ్యం, చింతపండు, డ్రై ఫ్రూట్స్, నెయ్యి, మిరపకాయలు కొనుగోలు చేశారు. దీంతో దుకాణాలు కిటకిటలాడాయి.

తగ్గిన టమాటా ధర..

టమాటా ధర ఈ వారం కిలోకు రూ. పది తగ్గింది. గత వారం కిలో రూ.50 ఉండగా, ఈ వారం రూ.40కి తగ్గింది. నాణ్యమైనది రూ.50 నుంచి రూ.60కి విక్రయించారు. ఉల్లిపాయలు, బంగాళాదుంపలు కిలో రూ.30, వంకాయ, బెండకాయ, దొండకాయ, బరబాటి కిలో రూ.40, బీరకాయ రూ.50, బీట్రూట్, క్యారెట్, కాకరకాయ రూ.60, క్యాప్సికం రూ.వందకు విక్రయాలు సాగాయి.

రూ.30 లక్షలతో కొత్తూరులో సీసీ డ్రెయిన్ నిర్మాణం



కొత్తూరులో సీసీ డ్రెయిన్ పనులకు శ్రీకారం చుడుతున్న ఎంపీపీ, ప్రజాప్రతినిధులు

అనకాపల్లి రూరల్ : మండలంలోని కొత్తూరు మేజర్ పంచాయతీలో రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్ పనులకు గురువారం ఎంపీపీ గొర్లి సూరిబాబు, జిల్లా పరిషత్ వైస్ చెయిర్‌పర్సన్ బీశెట్టి వరాహ సత్యవతి గురువారం శ్రీకారం చుట్టారు. ఎంతో కాలంగా కొత్తూరులో ప్రధాన డ్రెయిన్ పనులు జరగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే ప్రధాన వీధుల్లో మురుగు నీరు నిల్వ ఉండిపోతోంది. దీని వలన గ్రామంలో పారిశుధ్య సమస్య తీవ్రమవుతోంది. గురువారం ఇక్కడ ప్రధాన కాల్వ నిర్మాణ పనులకు బీజం పడటంతో పనులు పూర్తయితే మురుగునీటి అవాంతరాలు లేకుండా ప్రవహించడానికి ఆస్కారం ఉంటుందని స్థానిక ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వాలన్నీ తమ గ్రామ సమస్యలపై నిర్లక్ష్యం చూపగా ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో పాటు ఏళ్ల నాటి ప్రధాన సమస్యల పరిష్కారానికి మోక్షం కలుగుతోందని, ఇందుకు కృషి చేసిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఈ సందర్భంగా స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కొత్తూరు గ్రామ సర్పంచ్ సప్పారపు లక్ష్మీ ప్రసన్న, వరహాలరావు, బీశెట్టి జగన్, బుజ్జి, చలం, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి తోడపెద్దు అచ్చుపోత కార్యక్రమం

కశింకోట : కశింకోటలోని దేవర వీధిలో వరహాలక్ష్మీ నృసింహస్వామి అవతారంగా భక్తులు భావించి పూజించే తోడపెద్దు అచ్చుపోత కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇక్కడ ఉండే తోడపెద్దు పరమపదించడంతో మరో ఎద్దును తీసుకువచ్చి తోడపెద్దుగా రూపొందడానికి సంప్రదాయంగా అచ్చుపోత కార్యక్రమాన్ని జరపనున్నామన్నారు. ఎపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు, యువ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రేజేటి మారుతి సహకారంతో నిర్వహించే కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు రాత్రి 8.20 గంటలకు పూజా కార్యక్రమం జరుగుతుందని, ఈ నెల 26న ఉదయం 8.10 గంటలకు తోడపెద్దుకు అచ్చుపోత కార్యక్రమం జరుగుతుందన్నారు. గొల్ల కంచరపాలెం, వాడ్రాపల్లి, వెదుళ్ల నరవ, జోగవానిపాలెం, కొండకర్ల, వెంకటాపురం, మునగపాక, జంగుళూరు, భోగాపురం ప్రాంతాల నుంచి వచ్చి తోడపెద్దు సేవలు కార్యక్రమంలో పాల్గొంటాయన్నారు. అనంతరం తోడపెద్దు తిరు వీధి ఊరేగింపు నిర్వహించి మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరుపుతామన్నారు.

స్టార్టప్‌ల ఏర్పాటుకు నైపుణ్యం తప్పనిసరి



స్టార్టప్‌లపై జరిగిన సదస్సులో పాల్గొన్న దైట్ అధ్యాపకులు, విద్యార్థులు

తుమ్మపాల : సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం ఇన్నోవేషన్ ఆవశ్యకత గురించి వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు దైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు తెలిపారు. ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో దైట్ స్టూడెంట్ చాప్టర్, ఇన్నోవేషన్ స్టార్టప్‌లపై గురువారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు భవిష్యత్‌లో స్టార్టప్‌లు ఏర్పాటు చేసే విధంగా నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. విభాగాధిపతి ఎ.దేవీప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థి ఆచరణాత్మక విద్యను అభ్యసించాలని, తద్వారా మాత్రమే కొత్త ఆవిష్కరణలకు నాంది పలకగలరన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్స్ డీన్ కె.పార్వతి, దైట్ ఐఈఐ కన్వీనర్ హేమంత్‌కుమార్, రిసోర్స్‌పర్సన్ మద్ది గంగాధర్‌గుప్తా, అకడమిక్స్ అసోసియేట్ డీన్ ఎ.కృష్ణనాగ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడమ్మ తల్లి పండగ



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

నాతవరం: మండలంలో గురువారం మర్రిపాలెం వై.బి.పట్నం, నాతవరం, వల్సంపేట గ్రామాల్లో మరిడిమ్మ తల్లి పండగను భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. మండల కేంద్రంలో గల ఆలయంలో అమ్మవారిని మహిళలు అధిక సంఖ్యలో దర్శించుకుని పసుపు కుంకుమ చీర జాకెట్టు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థ ప్రసాదాలు తాగునీరు అందజేసింది వై.బి.పట్నం, వల్సంపేట, మర్రిపాలెం గ్రామాల్లో ఆలయాల వద్ద కూడా భక్తుల సందడి నెలకొంది. ఈ పండగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొంటే పంటలు బాగా పండుతాయని ఈ ప్రాంతీయుల నమ్మకం.

మాకవరపాలెం: మండలంలోని బూరుగుపాలెంలో మరిడమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. ఏటా స్థానికులు ఈ పండగను ఘనంగా జరుపుకొంటారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం నుంచి భక్తులు గ్రామంలో ఉన్న ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.